## విత్తన కొనుగోళ్లపై అవగాహన

జమ్మికుంట, మే 6: రాబోయే సీజన్‌లో విత్తనాల కొనుగోలు సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయశాఖ అధికారి షేక్‌ఖాదర్ హుస్సేన్ ఆధ్వర్యంలో బిజిగిరిషరీఫ్ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు విత్తనాలను లైసెన్సులు కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలని సూచించారు. ప్రతి విత్తన ప్యాకెట్‌కు తప్పనిసరిగా లాట్ నంబర్‌తో కూడిన రసీదు తీసుకోవాలని, ఎట్టి పరిస్థితిలో విడి విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. పత్తి విత్తనాలు బ్లాక్ మార్కెట్‌లో కొనవద్దని, సరైన వర్షాలు పడిన తర్వాతనే పంట వేయాలని అవగాహన కల్పించారు. ఇక్కడ ఏఈవోలు, రైతులు ఉన్నారు.

## పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద



వెదిరలో లైబ్రరీని ప్రారంభిస్తున్న మహిళా కమిషన్ చైర్‌పర్సన్ శారద, కలెక్టర్, ఎమ్మెల్యే

రామడుగు, మే6: విద్యార్థులు, యువత పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. మండలంలోని వెదిర ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఆడపిల్లలు, మహిళలకు ఎలాంటి కష్టం వచ్చినా కుటుంబ సభ్యురాలిగా సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. రామడుగు మండల అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, పుస్తక పఠనంతో సమాజంపై అవగాహన, జ్ఞానాన్ని పెంపొందుతుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, నిత్యం పుస్తక పఠనంతో విద్యార్థులు లక్ష్యాలను సాధించవచ్చని సూచించారు. అనంతరం ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో మార్కులు సాధించిన గ్రామానికి చెందిన కొరుకొండ పల్లవి, ప్రణీతను సన్మానించారు. 22 ప్రాంతాల్లో లైబ్రరీలను ఏర్పాటు చేసిన కేరళా విద్యార్థిని ఆకర్షణను వారు అభినందించారు. ఇక్కడ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, జిల్లా సంక్షేమశాఖ అధికారి సరస్వతి, తహసీల్దార్ రాజేశ్వరి, ఏఎంసీ చైర్మన్ తిరుమల తిరుపతి, హెచ్ఎం రాజమౌళి, తదితరులు ఉన్నారు.

## ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తాం



శతాక్షికి విమాన టికెట్ అందజేస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, మే 6: చదువుల్లో ప్రతిభ చూపించే విద్యార్థులను ప్రోత్సహిస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. బూరుగుపల్లి కి చెందిన గడ్డం శతాక్షికి లండన్‌లోని గ్రీన్‌విచ్ యూనివర్సిటీలో చదువుకోవడానికి అవకాశం వచ్చింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం కరీంనగర్‌లోని తన నివాసంలో శతాక్షిని అభినందించి, సొంత ఖర్చుతో కొనుగోలు చేసిన ₹70వేల విలువైన విమాన టికెట్‌ను అందజేశారు. తనను అభినందించి టికెట్ అందజేసిన ఎమ్మెల్యే సత్యంకు శతాక్షి, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తాం

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మంగళవారం వెంకంపల్లిలోని కొనుగోలు కేంద్రంలో అకాల వర్షానికి తడిసి ధాన్యాన్ని పరిశీలించారు. కేంద్రాల నిర్వాహకులు కొనుగోళ్లను వేగవంతం చేసి, ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, నాయకుడు బైరిశెట్టి సంపత్ ఉన్నారు.

## సీఎం వ్యాఖ్యలు బాధాకరం

జమ్మికుంట, మే 6: ఉద్యోగ, ఉపాధ్యాయలను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తమను తీవ్రంగా బాధించామని తెలంగాణ బహుజన టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బకాయి డీఏలు, పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఉద్యోగ విరమణ పొందిన ఐఏఎస్ అధికారుల సేవలకు స్వస్తి పలకాలని, నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అవినీతి అధికారుల ఆస్తులపై ఏసీబీ దాడులు చేయించాలని, ఫలితంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు.

## మజ్జిగ పంపిణీ

తెలంగాణ చౌక్, మే 6: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని శ్రీ సత్యసాయి చలి వేంద్రంలో భగవాన్ శ్రీ సత్యసాయి తల్లి ఈశ్వరమ్మ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు వెయ్యి మందికి మజ్జిగ వితరణ చేసినట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి తెలిపారు. అలాగే స్పందన వృద్ధాశ్రమంలో అన్నదాన సేవ, బాబా ఆలయంలో మాతృపూజ, భజన, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ సేవా సమితి కన్వీనర్ హరికృష్ణ, సభ్యులు మహేశ్, లక్ష్మణ్‌రావు, కనకయ్య ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, మే 6: నగరంలో కొత్తగా 11కేవీ లైన్, డీటీఆర్ పనులు చేపడుతున్నందున బుధవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 10.30గంటల వరకు గోదాంగడ్డ, అంజనాద్రి టెంపుల్ ప్రాంతం, గోదాం వెనుక ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

గన్నేరువరం, మే 6: గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి స్టేజీ, చొక్కలపల్లి, తుమ్మవానిపల్లి, మోత్కులపల్లిలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఆంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెట్లకొమ్మల తొలగింపులో భాగంగా ఉదయం 8:30నుంచి 11:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

## భూభారతికి 562 దరఖాస్తులు

సైదాపూర్, మే 6: భూభారతి పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలోని గొడిశాల, ఆకునూర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 562 దరఖాస్తులు వచ్చాయి. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లక్ష్మీకిరణ్ భూ సమస్యలపై దరఖాస్తుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్ గుర్రం శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ దొంత సుధాకర్, తదితరులు ఉన్నారు .

## ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

శంకరపట్నం, మే 6: ప్రతి రైతుకు 11అంకెలతో కూడిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రతి రైతుకు గుర్తింపుకార్డు ఉండేవిధంగా రైతు గుర్తింపుకార్డుల రిజిస్ట్రేషన్ ప్రారంభించినట్లు తెలిపారు. వ్యవసాయరంగాన్ని డిజిటలైజేషన్ చేయాలనే లక్ష్యంతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినట్లు వెల్లడించారు. అన్ని కేంద్ర పథకాలను ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ఈ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని స్పష్టంచేశారు. రైతులు తమ పట్టాదార్ పాస్ బుక్, ఆధార్‌కార్డు, ఆధార్‌తో అనుసంధానం చేసిన ఫోన్‌నంబర్‌తో క్లస్టర్ల పరిధిలోని ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

***రైతుల వివరాలు నమోదు***

కరీంనగర్ రూరల్, మే 6: చామనపల్లి, దుర్శేడ్, మొగ్దుంపూర్, నగునూర్‌ల్లోని రైతు వేదికలో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమాన్ని ఏఈవోలు మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజున ఇంటర్నెట్, సర్వర్ల కారణంగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయలేక పోయిన వ్యవసాయ సిబ్బంది రెండు రోజు భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఈ ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలు సేకరించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

## ఎన్‌వైకేలో భాగస్వామ్యం చేయండి

కొత్తపల్లి, మే 6: నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో (ఎన్‌వైకే) నిర్వహించే కార్యక్రమంలో యువజన సంఘాలు, యువజన అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేయాలని కోరుతూ మంగళవారం జిల్లా యువజన అధికారి ఎం వెంకటరాంబాబుకు వినతిపత్రం ఇచ్చారు. యువజన అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలకు చేరవేయడంలో యువజన సంఘాల పాత్ర ముఖ్యమైందని, అందుకే ఎన్‌వైకే ద్వారా నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. ఇక్కడ యువజన అవార్డీలు ఏ కిరణ్‌కుమార్, రెండ్ల కళింగ శేఖర్, అలవాల విష్ణు, కొండా రవి, మహ్మద్ అజమ్, సత్తినేని శ్రీనివాస్, జాతీయ కోర్డినేటర్ యాదవ రాజు, తొర్తి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



తిమ్మాపూర్ రూరల్: మల్లాపూర్ గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



శంకరపట్నం: ఇప్పలపల్లిలో నేలరాలిన మామిడి కాయలను చూపుతున్న రైతు పాశం శ్రీధర్‌రెడ్డి



చిగురుమామిడి: సుందరగిరి గ్రామంలో పిడుగుపాటుకు మృతి చెందిన పాడి ఆవు

# అకాల వర్షం.. అపార నష్టం

- ఈదురుగాలులతో నేలరాలిన మామిడికాయలు
- దెబ్బతిన్న వరి చేను, విద్యుత్ స్తంభాలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన వరి ధాన్యం
- ఆందోళనలో అన్నదాతలు



శంకరపట్నం: కేశవపట్నం గ్రామంలో నేలవాలిన వరి చేను

శంకరపట్నం, మే 6: అకాల వర్షాలు అన్నదాతలకు అపార నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈదురుగాలుల బీభత్సంతో మామిడికాయలు నేలరాలగా, కోత దశకు వచ్చిన వరి చేను, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోయిన వరి ధాన్యం తడిసిముద్దయింది. ఇప్పలపల్లిలో ఆరెకరాల్లో కోతకు వచ్చిన మామిడి తోటలో దాదాపు 6టన్నుల మామిడికాయలు ఈదురుగాలులకు నేలరాలగా ₹2.50లక్షల నష్టంవాటిల్లిందని రైతు పాశం శ్రీధర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంతోపాటు కన్నాపూర్, తదితర గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. కేశవపట్నంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. వంకాయగూడెం శివారులోని అయ్యప్ప కాలనీలో రాంశెట్టి ప్రసాద్ ఇంటి ప్రహరీ కూలింది. కేశవపట్నంలో ఒంటరి మహిళ మాచమల్ల లచ్చవ్వ ఇంటిరేకులు గాలికి ఎగిరిపోయాయి. పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, సరఫరాలో అంతరాయం కలిగింది. ఎన్పీడీసీఎల్ సిబ్బంది మంగళవారం మధ్యాహ్నం వరకు శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

### కేంద్రాల్లో తడిసిన ధాన్యం

తిమ్మాపూర్ రూరల్, మే 6: గట్టుదుద్దెనపల్లి సొసైటీ పరిధిలోని మల్లాపూర్‌లో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రంలోని వరి ధాన్యం తడిసిపోయింది. కేంద్రంలో ధాన్యంపోసి నెలరోజులు కావస్తున్నా ఇప్పటివరకు వడ్లు కొనలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, తడిసిన ధాన్యాన్నీ కొనుగోలు చేయాలని వారు కోరారు.

### పిడుగుపాటుతో ఆవు మృతి

చిగురుమామిడి, మే 6: సుందరగిరి గ్రామంలో జీల రాజు రైతుకు చెందిన పాడి ఆవు సోమవారం రాత్రి పిడుగుపాటు గురై మృతి చెందింది. రూ.50వేల విలువైన ఆవు మృతి చెందడంతో బాధిత రైతు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని బాధిత రైతు అధికారులను కోరారు.

### దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరగిరి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో సందవేని మల్లయ్య రైతు మామిడి తోట, ఇందుర్తిలో చింతపూల నరేందర్ వరి పంట, సుందరగిరిలో కూలిపోయిన గంగు కుమార్‌కు చెందిన రేకులషెడ్డును పరిశీలించారు. ఇక్కడ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు గూడెం లక్ష్మి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేశ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉన్నారు.

### రైతులను ఆదుకోవాలి

హుజూరాబాద్ టౌన్/వీణవంక/తెలంగాణచౌక్,, మే 6: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని రైతు, ప్రజాసంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. రైతు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి మంగళవారం హుజూరాబాద్, వీణవంక మండలాల్లోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టం వివరాలను సేకరించి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నగరంలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మానకొండూర్, హుజూరాబాద్, తిమ్మాపూర్, శంకరపట్నం, వీణవంక మండలాల్లో సంఘం సభ్యులతో కలిసి పంటలను పరిశీలించారు. రైతుల నుంచి పంట నష్టాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టాన్ని అంచనా వేసి, రైతులకు పరిహారం అందించాలని కోరారు.

# పంట మార్పిడి చేయాలి

- సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు
- కలెక్టర్ పమేలా సత్పతి



కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కొత్తపల్లి, మే 6: రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబిస్తూ, సేంద్రియ ఎరువుల వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్ వ్యవసాయ విద్య విశ్వ విద్యాలయం పరిధిలోని కరీంనగర్ వ్యవసాయ పరిశోధనస్థానం ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమాన్ని కొత్తపల్లి మండలం బద్దిపల్లి రైతువేదికలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వీలైనంత తక్కువగా రసాయనాలను వాడాలని సూచించారు. సేంద్రియ ఎరువులతో దిగుబడిలో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. డీలర్ల వద్ద ఎరువులు, పురుగుల మందులు కొనుగోలు చేస్తే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. లాభాలు సాధించడంలో నేల స్వభావాన్ని తిరిగి పొందడంలో పంట మార్పిడి విధానం ఉత్తమమైనదన్నారు. రైతులు వరికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా, చిరుధాన్యాలు, పండ్లు, పూల మొక్కలు, కూరగాయల పెంపకంపై దృష్టిసారించాలన్నారు. పంట వ్యర్థాలను కాల్చడంతో విపరీతమైన కాలుష్యంతోపాటు వృక్షసంపదకు నష్టం వాటిల్లుతోందన్నారు. అనంతరం సాగు విధానానికి అవలంబించాల్సిన పద్ధతులపై కరపత్రాలను విడుదల చేశారు. ఇక్కడ డీపీవో భాగ్యలక్ష్మి, శాస్త్రవేత్తలు ఉషారాణి, మధుకర్‌రావు, శ్రావణి, విద్యా భాస్కర్, మదన్మోహన్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

## కాంగ్రెస్ నుంచి 'పురమల్ల' సస్పెన్షన్

కార్పొరేషన్, మే 6: జిల్లా కాంగ్రెస్ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమన్వయ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ ఎదుటే పరోక్షంగా మంత్రి పొన్నంపై విమర్శలు చేయడంపై ఆ వర్గానికి చెందిన నాయకులు తీవ్రంగా స్పందించి సమావేశంలో గొడవపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పొన్నం వర్గీయులు హైదరాబాద్‌లో పీసీసీ ప్రెసిడెంట్‌కు శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన క్రమశిక్షణ కమిటీ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్న శ్రీనివాస్‌ను సస్పెండ్ చేసింది.

## సార్వత్రిక సమ్మెలో భాగస్వాములవుతాం

విద్యానగర్, మే 6: సార్వత్రిక సమ్మెలో ఆశ కార్యకర్తలు భాగస్వాములవుతామని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మారెళ్ల శ్రీలత పేర్కొన్నారు. ముకుందలాల్ మిశ్రాభవన్ ఆఫీస్‌లో ఆమె మాట్లాడారు. ఆశ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని కోరారు. ఇక్కడ జిల్లా అధ్యక్షులు శారద, మహిళా నాయకులు రాజమణి, రజిత, జయలక్ష్మి, రోజా, లక్ష్మి, ప్రియాంక, సరిత, లత, సత్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

జమ్మికుంట, మే 6: సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొంటారని తెలియజేస్తూ కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్ అసోసియేషన్ల జాయింట్ ఫ్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ నాయకులు మున్సిపల్‌లో కమిషనర్ ఎండీ అయాజ్‌కు సమ్మె నోటీస్ అందించారు. ఇక్కడ అసోసియేషన్ నాయకులు రాజు, రవి, నరేందర్, రమేశ్, సంపత్, పద్మ, సరోజన, మహేశ్, రాజేందర్, నరేశ్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

## అస్తమా.. అలర్జీ మాత్రమే

విద్యానగర్, మే 6: అస్తమా వ్యాధి కాదని.. కేవలం అలర్జీ మాత్రమేనని మెడికవర్ పల్మనాలజిస్ట్ డాక్టర్ రవీంద్రాచారి పేర్కొన్నారు. వరల్డ్ అస్తమా డే సందర్భంగా మంగళవారం కరీంనగర్ మెడికవర్ దవాఖానలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ, దగ్గు, ఆయాసం, అలర్జీ మాత్రమే అస్తమా లక్షణాలన్నారు. అస్తమా అంటువ్యాధి కాదని.. దుమ్ము చల్లగాలి ద్వారా మాత్రమే ఊపిరితిత్తులు రియాక్షన్ అవుతాయని వెల్లడించారు. అస్తమాను త్వరగా గుర్తిస్తే.. నయంచేయడం సులువు అవుతుందన్నారు. వ్యాక్సినేషన్‌తో అస్తమాను పూర్తిగా దూరం చేయవచ్చన్నారు. ఇక్కడ మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, క్రిటికల్ కేర్ నిపుణుడు డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ వైద్యులు నాగరాజు, లోకేష్, సూపరింటెండెంట్ డాక్టర్ రవి, మల్లారెడ్డి ఉన్నారు.

## పాకిస్థానీలను పంపించండి

హుజూరాబాద్ టౌన్/గంగాధర/కొత్తపల్లి, మే 6: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్థానీలను వెంటనే వారి స్వదేశానికి తిరిగి పంపించాలని హుజూరాబాద్, ఇల్లందకుంట, గంగాధర, కొత్తపల్లి మండలాల్లో బీజేపీ నాయకులు మంగళవారం తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దారకు వినతిపత్రాలు అందజేశారు. భారత ప్రభుత్వం పాకిస్తానీలను బహిష్కరించిందని, వెంటనే వారు ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు.

## దేశ ప్రజలను ఏకతాటిపైకి తేవాలి

తెలంగాణచౌక్, మే 6: పాకిస్తాన్‌తో ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా దేశ ప్రజలందరినీ ఏకతాటిపై తీసుకురావాలని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. నగరంలోని కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఇక్కడ శ్రీధర్, తదితరులు ఉన్నారు.

## విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి

జమ్మికుంట, మే 6: మున్సిపల్ పరిధిలోని శ్రీ దుబ్బ మల్లికార్జునస్వామి ఆలయం చుట్టూ విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ ఆలయ పూజారుల ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ మేరకు కమిషనర్ ఎండీ అయాజ్ వెంటనే స్పందించి ఏఈ నరేశ్‌తో మాట్లాడారు. ఆలయం చుట్టూ విద్యుద్దీపాల ఏర్పాటు ప్రక్రియపై దృష్టిసారించాలని ఆదేశించారు. ఇక్కడ పూజారులు ఉన్నారు.

## అదుపు తప్పిన లారీ

శంకరపట్నం, మే 6: మండలంలోని వంకాయగూడెం వద్ద జాతీయ రహదారి 563పై ఓ లారీ అదుపు తప్పింది. విశాఖపట్నం నుంచి నాగ్‌పూర్‌కు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న లారీ మంగళవారం వంకాయగూడెం వద్దకు రాగానే డ్రైవర్‌కు నిద్ర మత్తు కారవణంగా అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లగా, ఎవరికీ గాయాలు కాలేదు.

## కొత్తి మీర పంటపై గడ్డిమందు స్ప్రే

మానకొండూర్, మే 6: మండలంలోని నిజాయితీగూడెం గ్రామానికి చెందిన సందెసారి రాయమల్లు తన పొలంలో 20గుంటల్లో కొత్తిమీర సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్తిమీర పంటపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డమందు కొట్టడంతో పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఈ మేరకు రైతు రాయమల్లు మంగళవారం మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు నష్టం వాటిల్లిన పంటను పరిశీలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

## పీహెచ్‌సీలో ఆశా డే వేడుకలు

శంకరపట్నం, మే 6: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆశా డే వేడుకలు జరుపుకొన్నారు. ఏప్రిల్ నెలలో నాలుగు సాధారణ ప్రసవాలకు కృషి చేసిన ఆశ కార్యకర్తలు విజయ (ధర్మా రం), రజిత (మెట్‌పల్లి), లావణ్య (తాడికల్), లలిత (కేశవపట్నం)ను ఘనంగా సన్మానించి, చీరలను ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలన్నారు.

## సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

తెలంగాణచౌక్, మే 6: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలత పిలుపునిచ్చారు. ఈ మేరకు నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఈ నెల 20 చేపట్టనున్న సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఆశ కార్యకర్తలకు ఉద్యోగ, సామాజిక భద్రత, పీఎఫ్, ఈఎస్ఐతోపాటు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ మహిళా నాయకులు శారద, ప్రియాంక, సరిత, లత, వరలక్ష్మి, తదితరులు ఉన్నారు.

## జస్టిస్ కుమారయ్య లా కాలేజ్‌లో జాతీయ స్థాయి మూట్ కోర్ట్ పోటీ

కొత్తపల్లి, మే 6: జస్టిస్ కుమారయ్య కాలేజ్ ఆఫ్ లా కళాశాలలో జాతీయ స్థాయి లీగల్ మూట్ కోర్ట్ పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏప్రిల్ 26 నుంచి మే 5 వరకు జరిగిన జాతీయస్థాయి లీగల్ మూట్ కోర్ట్ పోటీలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అనేక మంది విద్యార్థులు హాజరై ఉత్సాహంగా పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ శివకుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్ నాగరాజు హాజరయ్యారు. ఇక్కడ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే జలజారెడ్డి, తదితరులు ఉన్నారు.

## అప్రమత్తతోనే ప్రమాదాల నియంత్రణ

ముకరంపుర, మే 6: క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటేనే విద్యుత్ ప్రమాదాలను నియంత్రించవచ్చని చీఫ్ ఇంజినీర్ (ఆపరేషన్) అశోక్ పేర్కొన్నారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ భద్రతా వారోత్సవాల కార్యక్రమానికి సీఈ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రైతులు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తూ ప్రమాదాలు జరుగకుండా చూడాలన్నారు. అంతకుముందు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించేలా ముద్రించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. విద్యుత్ కళాకారులతో ఆయుష్మాన్ భవ పేరుతో నిర్వహించిన ప్రదర్శన ఆకట్టుకున్నది. ఇక్కడ డీఈలు ఉపేందర్, రాజం, ఏడీఈలు శ్రీనివాస్‌గౌడ్, లావణ్య ఉన్నారు.

## పరిహారం కోసం విజ్ఞప్తి

ముకరంపుర, మే 6: పిడుగుపాటుకు ఇల్లుతోపాటు వైరింగ్, గృహోపకరణాలు కాలిపోయి నష్టపోయిన తమకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని నగరంలోని రేకుర్తి గౌడ్స్ కాలనీకి చెందిన జలిగం కనకలక్ష్మి మంగళవారం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. సుమారు ₹8లక్షల నష్టం వాటిల్లిందని, పరిహారం ఇప్పించాలని విన్నవించారు.

## మాజీ ఎమ్మెల్యే సుంకె పరామర్శ



నందయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, నాయకులు

గంగాధర, మే 6: బూరుగుపల్లి గ్రామానికి చెందిన దూలం నందయ్య అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం నందయ్యను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, రామిడి సురేందర్, వడ్లూరి ఆదిమల్లు, దోమకొండ మల్లయ్య, మామిడిపెల్లి అఖిల్, తదితరులు ఉన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ఉద్యమిద్దాం

చిగురుమామిడి, మే 6: డ్రగ్స్ నిర్మూలనకు సమష్టిగా ఉద్యమించాల్సిన సమయం అసన్నమైందని డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర కోఆర్డినేటర్ డ్యాగల సారయ్య, జేఏసీ నాయకులు కోడూరి శ్రీదేవి, చెప్యాల ప్రకాశ్ పేర్కొన్నారు. మంగళవారం ఉల్లంపల్లి, సుందరగిరి, బొమ్మనపల్లి, రేకొండ గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర అవగాహన సదస్సులు నిర్వహించారు. డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఇక్కడ జేఏసీ నాయకులు శ్రీ మూర్తి రమేశ్, వేముల జగదీష్, నాంపల్లి సమ్మయ్య, తోటపల్లి జగన్, కుమారస్వామి, ఏపీఎం మట్టెల సంపత్, సేర్ప్ (ఐకేపీ) సీసీలు వెంకటమల్లు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

## బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం, నాయకులు

చిగురుమామిడి, మే 6: సుందరగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో ఆలయ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ నెల 8 నుంచి 16వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. 12న స్వామివారి కల్యాణోత్సవం, 15న బండ్లు తిరుగడం, 16న రథోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో రాజకుమార్ తెలిపారు. ఇక్కడ మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఈవో రాజకుమార్, సీనియర్ అసిస్టెంట్ బూట్ల కవిత, ఆలయ పూజారి శేషం నవీనాచార్యులు, తదితరులు ఉన్నారు.

## ప్రీ డిగ్రీ కోర్సు ఫలితాల విడుదల

కమాన్‌చౌరస్తా, మే 6: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ప్రీ డిగ్రీ మొదటి, రెండో సంవత్సర పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చిలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు వెబ్‌సైట్ (http://103.119.113.107:89, www.satavahana.ac.in) లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## నేడు జయంత్యుత్సవాలు

హుజూరాబాద్ టౌన్, మే 6: పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం వాసవీమాత జయంత్యుత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవా రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30గంటలకు సహస్ర నామ కుంకుమార్చన, అభిషేకాలు, అర్చన, సాయంత్రం 4గంటలకు బైక్‌ర్యాలీ, సాయంత్రం 6గంటలకు వాసవీమాత పారాయణం, సాంస్కృతిక నృత్య ప్రదర్శన, అన్నప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

## విరిగిపడ్డ చెట్టు.. తప్పిన ప్రాణాపాయం

వీణవంక, మే 6: బేతిగల్ గ్రామంలో సమ్మయ్య ఇంటిపై సోమవారం రాత్రి గాలివాన బీభత్సానికి చెట్టు విరిగిపడగా, ప్రాణాపాయం తప్పింది. సమ్మయ్య కుటుంబ సభ్యులతో కలిసి రేకుల ఇంట్లో నిద్రిస్తుండగా, గాలివానతో పక్కనే ఉన్న వేపచెట్టు విరిగి పడింది. ఇంట్లోని సామగ్రి ధ్వంసం కాగా, ఎలాంటి ప్రాణనష్టం జరుగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



బేతిగల్‌లో గాలివానకు సమ్మయ్య ఇంటిపై విరిగిపడ్డ చెట్టు